క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


చెట్టి పాల్గుణ, అరకు ఎమ్మెల్యే

అరకులోయ రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమతంగా ఉండాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు, సీజన్‌లో మార్పుల వల్ల వ్యాధులు ప్రబలే అవకాశముందని, వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి వ్యాధి లక్షణాలు ఉన్న సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల వైద్యులను సంప్రదించాలని కోరారు.

నేడు గ్రామాల్లో 'గడప గడపకు'

అడ్డతీగల: అడ్డతీగల మండలం వేటమామిడి సచివాలయం పరిధిలో పనుకురాతిపాలెం, వేటమామిడి, పైడిపుట్ట గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం 2 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.బాపన్నదొర తెలిపారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొని ఇంటింటికీ వెళ్లి, వారి సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొవాలని కోరారు.

సదానంద సరస్వతి స్వామీజీకి ప్రత్యేక పూజలు


స్వామీజీ పాదుకులకు పూజలు చేస్తున్న భక్తులు

అడ్డతీగల: పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య గురువర్యులు సదానంద సరస్వతి స్వామీజీకి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ అయ్యప్పశర్మ ఆధ్వర్యంలో స్వామీజీ చిత్రపటం వద్ద ఉన్న దివ్య పాదుకులకు అభిషేకం చేసినట్టు వెంకటరామయ్య తెలిపారు. అనంతరం అష్టోత్తర పూజ,శ్రీ చక్రార్చన, నీరాజన మంత్ర పుష్పాలతో పూజలు నిర్వహించామన్నారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశామన్నారు.

కూలిన పాఠశాల భవనం పైకప్పు


చుట్టుగుమ్మి గ్రామంలో వీధులగాలులకు దెబ్బతిన్న పాఠశాల భవనం

జి.మాడుగుల: మండలంలో లువ్వాసింగి పంచాయతీ చుట్టుగుమ్మి గ్రామంలో శనివారం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పై కప్పు దెబ్బతింది. పాఠశాల భవనం పైకప్పు రేకులు గాలులకు ఎగిరిపోవడంతో భవనం కూడా పాక్షికంగా దెబ్బతింది. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో నృసింహస్వామి గంధం అరగదీత

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం దిబ్బవీధి లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారి గంధం అరగదీత భక్తిశ్రద్ధల మధ్య సాగింది. ఈ కార్యక్రమానికి మహిళా భక్తులు అధికసంఖ్యలో హాజరై గంధాన్ని సిద్ధం చేసినట్టు ఆలయ వ్యవస్థాపకుడు మళ్ల రామచంద్రరావు చెప్పారు. ఈ గంధాన్ని స్వామివారికి సోమవారం పూయనున్నామన్నారు.

నేలల యాజమాన్యం పాటించాలి

అచ్యుతాపురం(అనకాపల్లి): రైతులు పంటలు సాగు చేసే విషయంలో నేలల యాజమాన్యం పాటించాలని, రసాయన ఎరువులతో పాటు పచ్చిరొట్ట పంటలు, వర్మీ కంపోస్టును ఉపయోగించాలని నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు సూచించారు. ఆదివారం హరిపాలెం గ్రామంలో స్థానిక ఎరువులతో వ్యవసాయ విద్యార్థులు నేలల యాజమాన్యంపై సమూహ చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల వాడకంపై పలు సూచనలు ఇచ్చారు.

ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు


పి.జి.మాడుగులంలో పర్యటిస్తున్న సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ విజయకుమారి


టేకులబోరులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


ఆర్.కొత్తూరులో నిర్వహిస్తున్న కార్యక్రమం


గ్రామస్తులకు కరపత్రం అందిస్తున్న సర్పంచ్ లలిత తదితరులు


రంపచోడవరంలో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

ముంచంగిపుట్టు: జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో జగనన్నే మా భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జోరుగా సాగుతోంది. ప్రజాప్రతినిధులు, పార్టీశ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన మోసాలను తెలియజేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. గిరిజన గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తోంది.

● ముంచంగిపుట్టు మండలంలోని వనుగుమ్మ, జోలాపుట్టు, దొడిపుట్టు, మాకవరం, బరడ పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్, స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. శివారు గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి ఇతరత్రా విషయాలను గ్రామస్తులకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజల చెంతకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వానికి ప్రజలు మద్దతు తెలియజేయాలని కోరారు. ఇళ్లకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం స్టిక్కర్లను అతికించారు. వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి, ఎంపీటీసీ సభ్యుడు లబ్బో, నాయకులు జగబందు, బలరాజు, పులిరాజు, శివ, భగత్‌రాం, దేవ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని దిగుడుపుట్టు, కోటాప్పల్లి, తీగలవలస, సంతారి ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, సర్పంచ్ బొంజుబాబు, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, నాయకులు సూరిబాబు, అనిల్, వెంకట్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని గూపిగెడ్డ, సంతబయలు, నేరేడువలస, పి.జి.మాడుగుల, లువ్వాసింగి, వంజరి, వంతాల, పెదలోచలి, సుర్మతి, సింగర్బ, పాలమామిడి తదితర ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీ మత్స్యరాస విజయకుమారి పంచాయతీ కన్వీనర్ బాబూరావు, వార్డు సభ్యురాలు కళావతి, గ్రామ పెద్దలు ప్రసాద్, బుల్లిబాబు, ఇన్నబాబు, లక్ష్మయ్య గృహసారథులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని ఆర్.కొత్తూరు, కంఠారం తదితర ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు అప్పన వెంకటరమణ, సచివాలయ కన్వీనర్ అచ్చిరాజు, పీఏసీఎస్ చైర్మన్ గజ్జయ్యదొర, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జె.రాజులమ్మ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, నాయకులు సత్యనారాయణ, ఉప సర్పంచ్ వనం బాబు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: మండలంలో చౌడుపల్లి పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ లలిత, మండల పార్టీ అధ్యక్షుడు మోరి రవి, ఎంపీటీసీ సభ్యురాలు మీనా కుమారి,ఉప సర్పంచ్ రాజేష్, కో-ఆప్షన్ సభ్యుడు నాజర్ వలీ, నాయకులు సింహాచలం, వలంటీర్లు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, అన్నవరం దేవస్థానం బోర్డు డైరెక్టర్ కారుకోడి పూజ, కార్యకర్తలు ఇబ్రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: నెల్లిపాక, ఎటపాక, నల్లకుంట, టీపీవీడు సచివాలయాల పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బూరం అంజలి, సర్పంచ్ దుర్గాలక్ష్మి, నాయకులు అప్పల రెడ్డి, సత్యనారాయణ, నాగేశ్వరావు, నవీన్, కోటి, కన్న, వెంకటరమణ తదితరులున్నారు.

కూనవరం: కూనవరం, టేకులబోరు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జేసీఎస్ ఇన్‌చార్జి ఆవుల మరియాదాస్, మేరుకులం కార్పొరేషన్ డైరెక్టర్ డి.గంగాధర్, ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మాని అనంత లక్ష్మి, నాయకులు కె.సునీత, శివరామ్, ఎస్.సాయి, రమేష్, మున్నాఫ్, కె.వీర్రాజు, ఎలిపె రమేష్, పి.వీరబాబు, పి.శ్రీను, ఎంవీవీ రాజు, కె.లక్ష్మి, బి.శ్రీను, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.


వనుగుమ్మలో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


దిగుడుపుట్టులో పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ మత్స్యలింగం,సర్పంచ్ పూర్ణిమ


కాపవరంలో ఇంటింటికీ స్టిక్కర్లు అంటిస్తున్న నేతలు

వేసవి నేస్తాలకు గిరాకీ

- భానుడి భగభగలు
- తాటి ముంజెలపై ఆసక్తి
- ఎండలకు అల్లాడుతున్న మిర్చి కూలీలు

ఎటపాక: ఏజెన్సీ ప్రాంతమైన చింతూరు డివిజన్‌లో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. భానుడి భగభగలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మరో పక్క మిర్చి కూలీలు మండే ఎండల్లో పనులు చేయలేక అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో వేసవి తాపాన్ని తట్టుకునేందుకు ఉపయోగపడే చల్లని పానీయాలకు గిరాకీ పెరిగింది. పట్టణాల్లో శీతలపానీయాల దుకాణాలు ప్రతీ వీధిలోనూ వెలిశాయి. వివిధ రకాల పానీయాలు, పండ్ల రసాలు వంటి వాటిని సేవిస్తూ, ప్రజలు సేదతీరుతూ ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందుతున్నారు. కొబ్బరి బొండాలు, పుచ్చకాయలు, తాటి ముంజలు తదితర వేసవి నేస్తాలకు మంచి గిరాకీ ఉంది. గ్రామీణ ప్రాంతాల నుంచి గిరిజనులు తాటి ముంజలను తీసుకొచ్చి ప్రధాన రహదారులపై విక్రయిస్తున్నారు. జోరుగా వ్యాపారం సాగుతోంది. ఎండ వేడిమితో పాటు శీతల పానీయాలు, పండ్లు ధరలు కూడా గత ఏడాది కంటే ఈ ఏడాది అధికంగా పలుకుతున్నాయి. దీంతో సామాన్య ప్రజలు ఈ ధరలను చూసి బెంబేలు చెందుతున్నారు. కొబ్బరి బోండం ధర రూ.25 నుంచి రూ.35 పలుకు తుండగా. పుచ్చకాయ రూ.100 నుంచి రూ. 200 వరకు ధర ఉంది. ఇక తర్బుజా, పైనాపిల్, ఆరంజ్, ద్రాక్ష జూస్ గత ఏడాది గ్లాస్ రూ.35 ఉంటే ఈ ఏడాది రూ.50 కు చేరింది. చెరకు రసంకు మంచి డిమాండ్ ఉంది. ఏదేమైనప్పటికీ ఈ నెలలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉండడంతో శీతల పానీయాలకు గిరాకీ పెరుగుతోంది. ఉదయం 9 గంటల నుండే ఎండలు మండుతుండటంతో చిన్నారులు, మహిళలు రోడ్లపైకి రావటానికే భయపడుతున్నారు. ఉదయం 11 గంటల నుంచి రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అయితే మిర్చి కోతలు ఉదయం 6 గంటలకే మొదలుపెట్టి మధ్యాహ్నం 12 గంటల్లోపే ముగిస్తున్నారు. మండుటెండలో సైతం కొందరు కూలీలు తలపై తాటాకులు పెట్టుకుని కల్లాల్లో మిర్చి కాయలు సేకరణ పనులు చేస్తున్నారు.


నోరూరించే పుచ్చకాయలు, వివిధ రకాల పండ్లు


తాటి ముంజెల విక్రయాలు

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పాడేరు రూరల్: అగ్ని ప్రమాదాలు జరిగితే అలసత్వం చేయకుండా సమీపంలో ఉన్న అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేసి, తక్షణ సహాయం పొందాలని జిల్లా అగ్నిమాపక శాఖా అధికారి కె.పి. నాయుడు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని కుమ్మరిపుట్టులో అగ్నిమాపక ప్రమదాలను వివరించారు. గ్యాస్ సిలిండర్ల ద్వారా జరిగే అగ్ని ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కలిపించారు. లీడింగ్ ఫైర్ మ్యాన్ బాలకృష్ణ, లక్ష్మణరావు, సిబ్బంది శివాజీరాజు, క్రాంతికుమార్, మోహన్‌బాబు, రాము, కొండలరావు, శివయ్య, రాంబాబు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.


అగ్నిమాపక ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా అగ్నిమాపక శాఖా అధికారి కేపీ నాయుడు

శివారు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ముంచంగిపుట్టు: మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మల్లికార్జున్ అన్నారు. మండలంలోని బరడ పంచాయతీ సిరగంపుట్టు గ్రామంలో పార్టీ నేతలతో కలిసి ఆదివారం పర్యటించారు.గ్రామ గిరిజనులతో సమావేశం నిర్వహించి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరుపై ఆరా తీశారు.గ్రామంలో చేపట్టాల్సిన పనులపై గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ శివారు గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.దశలవారీగా అన్ని సౌకర్యాలు కలిపించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజనులు వివిధ సమస్యలను నేతల దృష్టికి తీసుకువచ్చారు.ఎంపీటీసీ లబ్బో, నేతలు జగబందు, శివ, భగత్‌రాం, పులిరాజు, బాలరాజు,దేవ, తదితరులు పాల్గొన్నారు.


సిరగంపుట్టు గ్రామస్తులతో మాట్లాడుతున్న మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తింది. ఈనెల 19 నెల పండగ కావడం, మరోపక్క ఆఖరి ఆదివారం కావడంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అనకాపల్లి జిల్లాతో పాటు పొరుగు జిల్లాలు అయిన విజయనగరం, విశాఖ, పాడేరు జిల్లాల నుంచి అధికసంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శనానికి హాజరుకావడంతో ఆలయంలో ఉన్న క్యూలైన్లతో చలువ పందిళ్ల భక్తులతో నిండిపోయాయి. పదో తరగతి పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులు కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కొంత మంది భక్తులు ఆలయ ఆవరణలో ఉన్న చలువపందిళ్లలో వంటలు చేసి అమ్మవారికి నివేదించి కుటుంబసమేతంగా భోజనాలు చేసి ఆనందంగా గడిపారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్, అధికారులు భక్తులకు మజ్జిగ, మంచినీరు అందించారు. పట్టణ సీఐ దాడి మోహనరావు పర్యవేక్షణలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


నూకాంబికను దర్శించుకుంటున్న భక్తులు

గొండెలిలో సోలార్ వీధిలైట్లు


గొండెలిలో సోలార్ లైట్లను ఏర్పాటు చేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత విశ్వ

పాడేరు రూరల్: పాడేరు ఐటీడీఏ పరిధిలోని అన్ని గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటుకు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి చర్యలు తీసుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగ జోనల్ ఇన్‌చార్జి కిముడు శ్రీనివాస విశ్వ ప్రసాద్ నాయుడు స్పష్టం చేశారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి ఆదేశాల మేరకు ఎంపీ లాడ్స్ నిధులతో మండలంలోని గొండెలి గ్రామంలో ఆదివారం సోలార్ వీధిలైట్లు ఏర్పాటు చేశారు. వీధి దీపాల ఏర్పాటుతో గ్రామంలో రాత్రిపూట చీకట్లు తొలగిందన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు పలాసి రాజేశ్వరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎముకల దృఢత్వానికి పోషకాహారం అవసరం

మునగపాక : నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. అనకాపల్లి పద్మావతి ఆర్థోపెడిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరానికి డాక్టర్ ఆళ్ల వసంత్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా వసంతకుమార్ మాట్లాడుతూ ఎముకలు దృఢంగా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. శిబిరాన్ని హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీనారాయణ ప్రారంభించారు. శిబిరానికి 124 మంది రోగులు హాజరు కాగా వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

ఘనంగా పైడితల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



తుమ్మపాల: జీవీఎంసీ విలీన గ్రామం కొప్పాకలో పైడితల్లమ్మ మొదటి వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారికి పూజలు చేశారు. కుంకుమపూజలు, అభిషేకాలతో మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చిన్నారులతో పనులు చేయిస్తే ఫిర్యాదు

అనంతగిరి: చదువుకోవాల్సిన వయస్సులో పిల్లలతో పనులు చేయిస్తే, అలాంటి వారిపై బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ బాక లవకుశ అన్నారు. మండలంలోని కాశీపట్నం పంచాయతీ అరకు-విశాఖ ప్రధాన రహదారిలోని జీడితోటల వద్ద ఆదివారం బాల కార్మికులను గుర్తించి, వారికి అవగాహన కల్పించారు. చైల్డ్ లేబర్ యాక్ట్ ప్రకారం జిల్లాలోని బాల కార్మికులు లేకుండా చూడాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు చేపడుతుందన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన మిషన్ వాత్సల్య పథకం ద్వారా అనాథ పిల్లలకు ఆర్థిక సాయంతో ఈ పథకం భరోసా కల్పిస్తుందన్నారు. బాల కార్మికులు నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.


కాశీపట్నంలో చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న లవకుశ

మూడు పూరిళ్లు దగ్ధం

రూ.10 లక్షల ఆస్తి నష్టం

గంగవరం: గంగవరం మండలం రాజవరం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం సంభవించిన అగ్ని ప్రమాదంలో మూడు తాటాకిళ్లు సంపూర్ణంగాను, ఒక ఇల్లు పాక్షికంగా దగ్ధమై 11 నిరుపేద కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ఆదివారం మధ్యాహ్నం 3గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు బాధితులు, గ్రామస్తులు తెలిపారు. ఆరుగొళ్ల నాగరత్నం, నిడమర్తి బాపిరాజు, బూర నాగమ్మలకు చెందిన మూడిళ్లు దగ్ధమై వాటిలో నివాసం ఉంటున్న 11 నిరుపేద కుటుంబాలు కట్టు బట్టలతో మిగిలారు. అగ్ని ప్రమాద సమాచారాన్ని గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి, వీఆర్వో సత్యనారాయణకు ఇచ్చారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీమన్నారాయణ, రంపచోడవరం అగ్నిమాపక ఫైర్ ఇంజన్ సిబ్బంది హుటాహుటిన చేరుకొని సహాయక చర్యల్లో పాల్గొని మంటల అదుపు చేయించారు. గ్రామస్తులు సహాయక చర్యలల్లో పాల్గొని మంటల అదుపు చేశారని, లేకుంటే మరింత నష్టం వాటిల్లేదని సిటిజన్ సేవా సంస్థ డైరెక్టర్ చినబాబు తెలిపారు. అగ్ని ప్రమాదానికి సంబంధించిన వివరాలను తహసీల్దార్ శ్రీమన్నారాయణ విలేకరులకు వివరించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10లక్షల మేర ఆస్తి నష్టం కలిగిందన్నారు. నిరాశ్రయులైన 11 కుటుంబాలకు తక్షణ సాయం అందిస్తామన్నారు. వారు కోల్పోయిన రేషన్, ఆధార్, బ్యాంక్ ఖాతా ఇతర పత్రాలు మంజూరుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబిరత్నం, వైస్ ఎంపీపీలు రామతులసి , గంగాదేవి, సూరంపాలెం ఎంపీటీసీ పద్మావతి, జగ్గంపాలెం, జియ్యంపాలెం సర్పంచ్‌లు లీలావతి, సుబ్బలక్ష్మి, మొల్లేరు సొసైటీ డైరెక్టర్ పండా సిద్ధార్థ తదితరులు విచారం వ్యక్తం చేశారు. అగ్ని బాధిత కుటుంబాలకు తగిన విధంగా ప్రభుత్వం ఆదుకోవాలని సిటిజన్ సంస్థ డైరెక్టర్ నిడమర్తి చినబాబు, ఆదివాసీ జేఏసీ నాయకులు కుంజం సిద్దూ, వీర్రాజు తదితరులు అధికారులను విజ్ఞప్తి చేశారు.


అగ్ని ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న తహసీల్దార్ శ్రీమన్నారాయణ

గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరం

వై.రామవరం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి జైలు పాలవ్వవద్దని సిఐ వై.రాంబాబు అన్నారు. జనమైత్రి కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిఐ వై.రాంబాబు ఆధ్వర్యంలో కోట పంచాయతీ పరిధిలోని పుట్టపల్లి గ్రామంలో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు పోలీసులతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. గంజాయి సాగు, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. యువత పెడతోవ పట్టకుండా కాపాడుకునే బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని, సన్మార్గంలో నడవాలన్నారు. గిరిజన ప్రాంత అభివృద్ధిలో పోలీసు శాఖ పాలుపంచుకుంటుందన్నారు. యువతను ప్రోత్సహించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణా వంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగితే తమ దృష్టికి తీసుకొస్తే, సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలున్నా, భయపడకుండా నేరుగా తమవద్దకు వచ్చి తెలియజేయవచ్చన్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే సంభందిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామాల్లోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మూడనమ్మకాలతో ఆరోగ్యాన్ని ప్రాణాపాయస్థితికి తెచ్చుకోవద్దన్నారు. ఏదైన అనారోగ్యానికి గురైతే వెంటనే సమీప ప్రభుత్వాసుపత్రిలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుని, డాక్టరు సలహా మేరకు మందులు వాడమన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాన్ని రోగులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడానికి అందరూ కృషి చేయాలన్నారు. కోవిడ్ కేసులు మరలా పెరుగుతున్నాయని, అందరూ నిబంధనలు పాటిస్తూ తప్పనిసరిగా మాస్కులు ధరించి, సామాజిక దూరం పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామ యువతకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్, సిబ్బంది, కోట సచివాలయ మహిళా పోలీసు ఎల్.శ్రీకన్య ఉన్నారు.


పుట్టపల్లి గ్రామంలో జనమైత్రి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సీఐ రాంబాబు

తాగునీటి సమస్య పరిష్కరించరూ..


మర్రిగుడ సమీపంలోగల ఫిల్టర్ ట్యాంకు

అనంతగిరి: మండల కేంద్రంలోని తాగునీటి కష్టాలు మళ్లీ మొదలైయ్యాయి. అనంతగిరితో పాటుగా నాలుగు గ్రామాలను కలుపుకుంటూ మండల కేంద్రంలోని నిర్మించిన బహుళ మంచినీటి పథకం మూడు వారాలు క్రితం పాడైంది. దీంతో ఆయా ప్రాంతవాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఐదురోజులు క్రితం పథకానికి మరమ్మతు పనులు పూర్తిచేసి, తాగునీటికి అందించారు. అయితే రెండు రోజుల నుంచి మళ్లీ పథకం మూలకు చేరడంతో గిరిజనులు తాగునీటికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆటోలు, ద్విచక్రవాహనాల ద్వారా గెడ్డలు, ఊటలను ఆశ్రయించి, నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆయా ప్రాంతవాసులు చెబుతున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి, పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు చేయించి, తాగునీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.